కొనసాగుతున్న ప్రవచనాలు

- కోలాటాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దంపతులు
- ఆకట్టుకున్న శ్రీ కృష్ణుడి పారాయణం

మారుతీనగర్, జూలై 3: పట్టణంలోని వాసవి గార్డెన్‌లో నిర్వహిస్తున్న శ్రీ శృంగేరి శారదాపీఠం ఆస్థాన ప్రవచకుడు సంతోష్‌కుమార్ శాస్త్రి ప్రవచనాలు సోమవారం ఆరోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు-సరోజన దంపతులు పాల్గొన్నారు. శ్రీకృష్ణుడి సేవా కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే దంపతులు శ్రీ కృష్ణుడి ఉత్సవమూర్తిని తీసుకొచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉయ్యాలలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఎమ్మెల్యే దంపతులు శ్రీకృష్ణుడి వేషధారణలో ఉన్న చిన్నారులు, మహిళలు, భక్తులతో కోలాటమాడారు. కాగా మహిళలు, భక్తులు, సేవా సమితి సభ్యులు చేపట్టిన సామూహిక శ్రీ కృష్ణుడి పారాయణం ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, శ్రీమద్భాగవత కమిటీ సభ్యులు, సేవా సమితి సభ్యులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

కోలాటం ఆడుతున్న ఎమ్మెలే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దంపతులు

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే సుంకె పరామర్శ

మల్యాల, జూలై 3: ముత్యంపేట గ్రామానికి అనుబంధంగా ఉన్న కొండగట్టు దిగువకు చెందిన గుర్రం మల్లేశం సతీమణి శ్యామల ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. శ్యామల మృతికి గల కారణాలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట స్థానిక సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, మల్యాల, కొడిమ్యాల మండలాల అధ్యక్షులు మిట్టపల్లి సుదర్శన్, పునుగోటి కృష్ణారావు, బీఆర్ఎస్ నాయకులు జనగాం శ్రీనివాస్, త్రినాథ్, శ్రీనివాస్, ఆకుల నగేశ్ తదితరులున్నారు.

కొడిమ్యాల, జూలై 3: పూడూర్ గ్రామ ఆర్ఎంపీ భాస్కర్ చారి కుమారుడు డాక్టర్ సంతోష్ అనారోగ్యంతో మృతి చెందారు. కాగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, నాయకులు పెద్ది రవికుమార్ పాల్గొన్నారు.

బోనాల పండుగకు ముస్తాబైతున్న ఆలయం

మారుతీనగర్, జూలై 3: ఆషాఢ బోనాలను పురస్కరించుకొని ఈ నెల 5 నుంచి ప్రారంభమయ్యే బోనాల పండుగకు పట్టణ శివారులో గల మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం ముస్తాబవుతున్నది. ఈ క్రమంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ ఆదేశాల మేరకు పారిశుధ్య కార్మికులు ఆలయం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నారు. కాగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా గుంతలను చదును చేస్తూ, నీటి సౌకర్యం కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

వాటర్ కూలర్, నోట్ బుక్స్ పంపిణీ

విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వెల్గటూర్, జూలై 3: ఎండపల్లి మండలంలోని గొడిశెలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో కమల ఫౌండేషన్ వారి ఆర్థిక సహకారంతో రూ.25 వేల విలువైన వాటర్ కూలర్, 78 మంది విద్యార్థులకు రూ.13 వేల విలువైన నోట్ బుక్స్, పెన్నులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 2వ ఉప గవర్నర్ లయన్ సింహరాజు కోదండ రాములు, లయన్స్ క్లబ్ పెద్దపల్లి అధ్యక్షుడు సాదుల వెంకటేశ్వర్లు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ వెంకటరమణా రెడ్డి, అదనపు సెక్రటరీ జయపాల్ రెడ్డి, ట్రెజరర్ గంట్ల రాంచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు మీసాల సత్యనారాయణ, కుమారస్వామి, పాఠశాల హెచ్ఎం తిరుమల, ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ శంకరయ్య, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీ

రికార్డులను పరిశీలిస్తున్న ఏవో

పెగడపల్లి, జూలై 3: మండలకేంద్రంతో పాటు బతికపల్లి, మద్దులపల్లిలో ని పలు ఫర్టిలైజర్ దుకాణాలను మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి బీ వినీల సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని, నాసిరకం అమ్మితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలు కంపెనీలకు చెందిన విత్తన నమూనాలు సేకరించి పరీక్షలకు హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. ఇక్కడ ఏఈవో అశోక్ ఉన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

మాట్లాడుతున్న సీఐ రమణమూర్తి

ధర్మపురి, జూలై 3: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడుతుందని సీఐ రమణమూర్తి అన్నారు. సోమవారం ధర్మపురి పోలీస్ స్టేషన్ ఆవరణలో పట్టణ వర్తక వ్యాపారులతో సీసీ కెమెరాల ఏర్పాటు, ట్రాఫిక్ రూల్స్, డయల్ 100 గురించి ఎస్ఐ దత్తాత్రితో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోలీస్ శాఖ నేర నియంత్రణ, మెరుగైన సమాజం కోసం కృషి చేస్తున్నదన్నారు. ధర్మపురికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారని, భక్తుల ముసుగులో దొంగతనాలు, నేరాలకు పాల్పడే వ్యక్తులు కూడా వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. నేరాల నియంత్రణకు వర్తక వ్యాపారులు పోలీసులకు సహకరించాలని కోరారు. దుకాణాల ముందు, ప్రధాన కూడళ్లు, దేవాలయం పరిసర ప్రాంతం, గోదావరి పరీవాహక ప్రాంతంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో వర్తక సంఘం అధ్యక్షుడు అక్కనపల్లి రాజేందర్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మురికి శ్రీనివాస్, చౌడారపు సతీశ్, గుండ రమేశ్, పిప్పిరి సంజీవ్, సీపతి రాజేశ్, హరినాథ్, పిన్న శ్రీనివాస్, కూరగాయల రమేశ్, గునిశెట్టి శ్రీనివాస్, వర్తక వ్యాపారులు పాల్గొన్నారు.

సాయిచంద్‌కు సాంస్కృతిక సారథి బృందం నివాళి

సాయిచంద్ చిత్రపటాలతో నివాళులర్పిస్తున్న సాంస్కృతిక సారథి కళాకారులు

మల్యాల, జూలై 3: మండల కేంద్రంలోని బ్లాక్ చౌరస్తా వద్ద ప్రజా గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ చిత్రపటానికి జగిత్యాల సాంస్కృతిక సారథి కళాకారుల బృంద సభ్యులు సోమవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కళాకారులు రాగుల పరశురాం, ఎములాడ మహిపాల్, మల్లిక్ తేజ్, రాజేందర్, ప్రవీణ్, అశోక్, అర్చన, పోచయ్య, శ్రీకాంత్, సురేశ్, రాజేశ్వరితోపాటు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులు

మల్లాపూర్, జూలై 3: వీవీరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన రోడ్డ సింధు శ్రీ, ఆకుల రాజు అనే విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఎంపికపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు, హర్షం వ్యక్తం చేశారు.

కొడిమ్యాల, జూలై 3: కొడిమ్యాల మండలంలోని పూడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన ఇరుమల్ల సింధూజ బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఈ సందర్భంగా సింధూజను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హరిత, ఉపాధ్యాయుడు రాజేశ్ అభినందించారు.

కోరుట్ల రూరల్, జూలై 3: కల్లూరు గ్రామశివారులో గల ఆదర్శ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థినులు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పూదరి నర్సయ్య సోమవారం తెలిపారు. ఆదర్శ పాఠశాలకు చెందిన తేజస్విని, లక్ష్మీప్రసన్న ఎంపికయ్యారని, వీరిని సర్పంచ్ వనతడుపుల అంజయ్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

అన్ని రంగాల్లో జగిత్యాల అభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- పట్టణంలో 'మన వార్డు మన ఎమ్మెల్యే'

జగిత్యాల, జూలై 3: జగిత్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 8, 9వ వార్డుల్లో మన వార్డు మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా వార్డుల్లో పర్యటించారు. ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. మహిళలు ఎమ్మెల్యేకు తిలకందిద్ది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, 8వ వార్డులో రూ.కోటీ 50 లక్షలతో అభివృద్ధి పనులు చేశామని అన్నారు. 4520 డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం, మెడికల్ కాలేజీ సూపర్ స్పెషాలిటీ దవాఖాన ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు మల్లవ్వ-తిరుమలయ్య, శ్రీలత-రామ్మోహన్ రావు, నాయకులు భూమాగౌడ్, రమేశ్, నరేశ్, రాము, గంగాధర్, సమిండ్ల శ్రీనివాస్, ఆనంద్ రావు, కృష్ణారావు, శ్రీనివాస్, పూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శ

జగిత్యాల రూరల్, జూలై 3: జగిత్యాల అర్బన్ మండలంలోని హస్నాబాద్ గ్రామ సర్పంచ్ మునుగోటి లక్ష్మణ్ రావు అన్న అంజిత్ రావు ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. కాగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీటీసీ మల్లారెడ్డి, గ్రామ శాఖాధ్యక్షులు దూడ వెంకటేశ్, నాయకులు బత్తుల శ్రీధర్, బాపురపు నాగరాజు, పూర్ణచందర్ రావు తదితరులున్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు మౌన దీక్ష

వెల్గటూర్, జూలై 3: ఎండపల్లి మండలంలోని కొత్తపేట గ్రామంలో తీగుళ్ల జ్ఞానేందర్‌రెడ్డి తనతో సహజీవనం చేసి ఇప్పుడు మొహం చాటేస్తున్నాడని అదే గ్రామానికి చెందిన జీరెడ్డి వనిత సోమవారం తన ప్రియుడి ఇంటి ఎదుట నిరాహార దీక్షకు దిగింది. యువతి తెలిపిన వివరాల ప్రకారం.. వనితకు 8 సంవత్సరాల క్రితం వివాహం కాగా విడాకులయ్యాయి. అనంతరం హైదరాబాద్‌లో బ్యూటీ పార్లర్ నడుపుకుంటూ అక్కడే ఉంటుంది. కాగా ఏడాదిన్నర క్రితం జ్ఞానేందర్‌రెడ్డి హైదరాబాద్‌కు వెళ్లి ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. ఆరునెలలు సహజీవనం చేసి, రహస్యంగా తాళి కట్టాడు. తన తల్లిదండ్రులను ఒప్పించి తన ఇంటికి తీసుకెళ్తానని చెప్పాడు. అయితే తనను ఇంటికి తీసుకెళ్లాలని జ్ఞానేందర్‌రెడ్డిని వనిత కోరగా తప్పించుకొని తిరుగుతున్నాడని హైదరాబాద్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పుడు కూడా పెద్ద మనుషుల మధ్య వివాహం చేసుకుంటానని చెప్పాడని, ఇప్పుడు వివాహం చేసుకోను అని అంటున్నాడని, తనను వివాహం చేసుకునే వరకు ఇక్కడే మౌన దీక్ష చేస్తానని తెలిపింది.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

సారంగాపూర్, జూలై 3: సారంగాపూర్, బీర్‌పూర్ తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం తహసీల్దార్లు రవీందర్ రావు, శ్రీలత ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు విధిగా సమయానికి హాజరు కావాలని తహసీల్దార్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ ఆలయంలో ప్రత్యేక పూజలు

మల్యాల, జూలై 3: నూకపల్లి శివారులోని జ్ఞాన విజ్ఞాన సరస్వతీ ఆలయంలో మూల నక్షత్రాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ హోమ మండంపంలో ప్రత్యేక హోమాలు, యజ్ఞాలతోపాటు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి అంగలి రాజం, ఉప కార్యనిర్వాహణాధికారి గోపాల్‌రెడ్డి, అర్చకులు లక్ష్మీనర్సింహశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ జాతర ఉత్సవాలు

కథలాపూర్, జూలై 3: చింతకుంట గ్రామంలో సోమవారం పెద్దమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం కుల సంఘాల ప్రతినిధులు బోనాలు తీసి పెద్దమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఎడ్ల బండ్లను ఊరేగించారు. ఉత్సవాల్లో ద్వావతుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ భైర హేమలత, ఎంపీటీసీ బొడ్డు బాలు, ఉప సర్పంచ్ లోక నర్సారెడ్డి, కులసంఘాల ప్రతినిధులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.